క్లుప్తంగా

నేడు వనువులమ్మ తీర్థం


శెట్టిపల్లిలో వనువులమ్మ అమ్మవారు

అమలాపురం రూరల్: తాండవపల్లి పరిధిలోని శెట్టిపల్లి గ్రామదేవతైన వనువులమ్మ వారి తీర్థ మహోత్సవాలు బుధవారం నిర్వహించనున్నారు. మంగళవారం అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. గత 15 రోజులుగా గ్రామంలో సామాజిక వర్గీయులు వంతులవారీగా అమ్మవారి సేవలు చేస్తున్నారు. కైరం, చేట్ల కుటుంబీకులు అమ్మవారికి పుట్టింటి, అత్తింటి వారిగా పసుపుకుంకాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. తీర్థ మహోత్సవానికి చిందాడగరువు, రోళ్లపాలెం, వన్నె చింతలపూడి, కామనగరువు, రంగాపురం, సమనస, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

అయ్యప్ప మకర జ్యోతి దర్శనం


అమలాపురంలో స్వామివారి గ్రామోత్సవం

అమలాపురం రూరల్: ఈదరపల్లి బైపాస్‌రోడ్‌లో వేంచేసియున్న కోనసీమ మహాశాస్త్ర అయ్యప్పస్వామివారి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం మకరజ్యోతి దర్శనం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమలాపురానికి చెందిన తూము నాయుడు దంపతులు గణపతి హోమం, అయ్యప్పకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. శేష వెండి రథంపై పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమానపల్లి నటరాజస్వామి పడిపూజ వైభవంగా జరిపారు. రాత్రి 6.15 గంటలకు స్వామివారి దివ్యజ్యోతి దర్శనం భక్తులకు కల్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వాసన పుల్లయ్యనాయుడు, రామాయణం వెంకటేశ్వరరావు, బండారు గంగాధరం, నల్లా చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతల పంపిణీ

అల్లవరం: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గ్రామాలకు చేరుకున్న స్వామివారి అక్షతలను దేవగుప్తంలో మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత స్వామివారి అక్షతలకు వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఉంచి ఇంటింటికీ ఊరేగిస్తూ స్వామివారి అక్షతలను భక్తులకు అందించారు. కార్యక్రమంలో గొవ్వాల సత్యనారాయణ, బొంతు శివ, మామిడిశెట్టి సత్యనారాయణ, కట్టా రాంబాబు, బొంతు శ్రీను, పట్టాభి, గెద్దాడ సత్తిబాబు, పల్లపురాజు, సీహెచ్ రమణ, కుడపూడి శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో ముగ్గులు పరిశీలిస్తున్న మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ బాలాజీ

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన–ఎర్ర వంతెన మధ్య హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన కోనసీమ సంక్రాంతి సంబరాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. సంక్రాంతి పర్వదినాన నిర్వహించిన కోనసీమ ముగ్గుల పోటీలకు 300 మందికి పైగా మహిళలు పాల్గొని ఉత్సాహంగా ముగ్గులు వేశారు. విజేతలకు మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మి దంపతులు ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, గ్రైండర్, మిక్సీలు అందజేశారు. కనుమ రోజు ప్రభల తీర్థం ఘనంగా జరిగింది. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చిల్లా జగదీశ్వరి, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ తదితరులు సంబరాలను వీక్షించారు.

116 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్


నిందితుడు రాంబాబు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ట్రైనీ ఎస్పీ మిశ్రా తదితరులు

తాళ్లరేవు: మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జీవీ భవానీ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన పెనుపోతు రాంబాబు గాడిమొగ రహదారిలోని బస్‌స్టాప్ వద్ద మద్యాన్ని విక్రయిస్తుండగా పట్టుకుని అతడి వద్ద నుంచి 116 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాంబాబును విచారించగా పినపోతు మహేష్ అనే వ్యక్తి సూచనల మేరకు తాను విక్రయాలు సాగిస్తున్నట్లు చెప్పడంతో అతడిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో జిల్లా ట్రైనీ ఎస్పీ నవజ్యోతి మిశ్రా, ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


అమలాపురంలో జరిగిన గనికమ్మ ఆలయ ప్రభల తీర్థం


పల్లిపాలెం తీర్థంలో కొలువుదీరిన ప్రభలు


గొల్లవిల్లి వీధుల్లో ప్రభను ఊరేగిస్తున్న భక్తులు


బండారులంకలో ప్రభను దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా ప్రభల తీర్థం

- ప్రాచీన సంస్కృతికి అద్దం పట్టిన వేడుక
- ఉప్పొంగిన భక్తి భావం


పల్లిపాలెంలో ప్రభల తీర్థానికి హాజరైన భక్తులు


ఐ.పోలవరంలో ప్రభలకు పూజలు చేస్తున్న భక్తులు

ముమ్మిడివరం/ఐ.పోలవరం/అమలాపురం టౌన్/అమలాపురంరూరల్/ఉప్పలగుప్తం: నియోజకవర్గంలో కనుమ పండగను పురస్కరించుకుని మంగళవారం ప్రభల తీర్థాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాల మేళవింపుతో ఆయా గ్రామాల్లో దేవతామూర్తులను ప్రభలపై ఊరేగించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, ఐ.పొలవరం మండలం మొక్కతోట, కాట్రేనికోన మండలం చెయ్యేరు, తాళ్లరేవు గ్రామాల్లో పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో తీర్థ ప్రదేశాలు కళకళలాడాయి. పచ్చని పొలాల్లో రంగురంగుల దుస్తులు, పువ్వులతో అలంకరించి ఊరేగించిన ప్రభలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సన్నాయి మేళాలు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గంలో అతి పెద్ద ప్రభల తీర్థంగా పేరొందిన పల్లిపాలెం ప్రభల తీర్థం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొమానపల్లి, కొత్తలంక, ముమ్మిడివరం గ్రామాల తల్లి ప్రభలను ఆయా గ్రామాల నుంచి సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పులతో యువకుల కేరింతల నడుమ ఊరేగింపుగా పల్లిపాలెం తీర్థ ఆవరణకు తీసుకొచ్చారు. ముమ్మిడివరం అగ్రహారం, చింతలమెరక, వడ్డిగూడెం, పదో మైలురాయి, రాజుపాలెం, గ్రామాల ఉత్సవ ప్రభలను పచ్చని పంటపొలాలు, పంట కాలువలు దాటుకుని తీర్థ ప్రదేశానికి తీసుకొచ్చారు. ఆయా గ్రామాల శివ స్వరూపమైన ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రభలను పూలదండలతో అలంకరించారు. ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా తొలుత వచ్చిన ప్రభ మిగిలిన ప్రభలకు స్వాగతం పలుకుతుంది. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పెన్మత్స జగ్గప్పరాజు, పెన్మత్స చిట్టిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి శివన్నారాయణలు ప్రముఖులకు ఆహ్వానం పలికారు.

అమలాపురంలో..

స్థానిక వంటెద్దు వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీగనికమ్మ అమ్మవారి ఆలయం వద్ద శ్రీగనికమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన ప్రభల తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. పట్టణంలోని పలు వీధులకు చెందిన ప్రభలు ఇక్కడ కొలువయ్యాయి. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు. అమలాపురం రూరల్ మండలంలోని సాకుర్రు, బండార్లంకలో మంగళవారం ప్రభల తీర్థం వైభవంగా జరిగింది. సాకుర్రు వినాయక, దత్తేశ్వరస్వామి ఆలయాల వద్ద జరిగిన ప్రభల తీర్థానికి ఇందుపల్లి, ఇందుపల్లి గరువు, సాకుర్రు గ్రామాల నుంచి నాలుగు పెద్ద ప్రభలు, కొన్ని చిన్న ప్రభలు ఊరేగింపుగా తరలివచ్చాయి. ఆలయం వద్ద మధ్యాహ్నం తీర్థమహోత్సవం జరిగింది. ఇందుపల్లిలోని ఉమా రామలింగేశ్వరస్వామి, సాకుర్రులోని తపేశ్వర స్వామి వారి ఆలయాల నుంచి ప్రధాన ప్రభలను ఊరేగించారు. భట్నవిల్లి, ఎ.వేమవరం గ్రామాల్లోని ఆలయాల నుంచి ప్రభలను మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా ముక్తేశ్వరంలోని క్షణముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే ప్రభల తీర్థానికి తీసుకొచ్చారు.

ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి, సన్నవిల్లి, వాడపర్రు, భీమనపల్లి, విలసవిల్లి, ఎస్.కొత్తపల్లి, నంగవరం గ్రామాల్లో భక్తులు ప్రభలను అలంకరించి ఘనంగా ఊరేగించారు.

జస్టిస్ శివశంకర్‌ను కలిసిన ఎస్పీ శ్రీధర్


జస్టిస్ శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ సుసరాపు శ్రీధర్

అమలాపురం టౌన్: హైకోర్టు జడ్జిగా విధులు నిర్వర్తించిన రాష్ట్ర జ్యుడిషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బలుసు శివశంకర్‌ను జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అమలాపురంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూలకుండీ అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణానికి చెందిన జస్టిస్ శివశంకర్ నివాసానికి ఎస్పీ శ్రీధర్, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్‌లు వెళ్లి కలిసి కొద్దిసేపు మాట్లాడారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కోరంగి


టోర్నమెంట్ విజేత కోరంగి జట్టుకు బహుమతి ప్రదానం చేసిన సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు

తాళ్లరేవు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోరంగి పంచాయతీ సీతారామపురంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. సీతారామపురంలోని జగనన్న లేఅవుట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈ పోటీలను స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్ ప్రారంభించారు. టోర్నమెంట్‌లో సుమారు 16 జట్లు పాల్గొనగా కోరంగి, సీతారామపురం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో జరిగిన హోరాహోరీ పోరులో సీతారామపురం జట్టుపై కోరంగి జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు సర్పంచ్ మంగేష్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పెసింగి వర్మ, పెయ్యల శ్రీనివాస్, మట్టపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు


పి.మల్లవరంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

తాళ్లరేవు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పి.మల్లవరం పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆప్త(అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) కోశాధికారి ధూళిపూడి సురేష్ సహకారంతో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా మిక్సీ, రెండో బహుమతిగా నాన్‌స్టిక్ పాన్‌సెట్, మూడో బహుమతిగా వాటర్ ఫిల్టర్‌తో పాటు నాలుగు, ఐదు బహుమతులను కూడా అందజేశారు. కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ, ముత్యాల జయలక్ష్మి, విళ్ల సత్యనారాయణ, దున్నా సుబ్రహ్మణ్యం, అంబేడ్కర్, మురళీ, శుభ, గంగ, పద్మ, పితాని సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

జోరుగా కోడి పందేలు

ఐ.పోలవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజుల పాటు కోడి పందేలు జోరుగా సాగాయి. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా నిర్వాహకులు మాత్రం వెనక్కి తగ్గలేదు. మండలంలోని కొమరగిరి, మురమళ్ల, ఎదుర్లంక, కేశనకుర్రు, జి.వేమవరం, ఐ.పోలవరంల్లో కోడి పందేలు, గుండాటలు ఎక్కువగా జరిగాయి. మండలవ్యాప్తంగా పండగ మూడు రోజులు కలిపి సుమారు రూ.8 కోట్ల మేర నగదు చేతులు మారినట్లుగా అంచనా వేస్తున్నారు.

అల్లవరం: మండలంలోని రెల్లుగడ్డ, గోడి, గుత్తుల వారిపాలెం, కోడూరుపాడు, అల్లవరం, దేవగుప్తం గ్రామాల్లో సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు, గుండాట జోరుగా సాగాయి. రెల్లుగడ్డ గ్రామంలో జరిగిన పందెం బరిలో లక్షల్లో వ్యాపారం సాగింది. ఒక్కో పందెం కనీసం రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకూ జరగడంతో నిర్వాహకులకు కాసుల వర్షం కురిసింది. ఇక్కడ జరిగిన గుండాట బోర్డులు దేవగుప్తం గ్రామానికి చెందిన ఓ వస్త్ర వ్యాపారి దక్కించుకుని టేబుల్ ఎంట్రీ రూ.500 నుంచి రూ.5 వేలు నిర్ణయించి జూద ప్రియుల జేబులు ఖాళీ చేశాడు. దీంతో గుండాటలో మోసం గ్రహించిన కొందరు జూదరులు నిర్వాహకులకు దేహశుద్ధి చేశారు.


కొమరగిరిలో జరుగుతున్న కోడి పందేలు


గెద్దనపల్లిలో సాగుతున్న గుండాట

కాట్రేనికోన: మండలంలోని గెద్దనపల్లి, చెయ్యేరు, పల్లంకుర్రు, వేట్లపాలెం, లోతు కాలువ, గచ్చకాయలపోర, చిర్రయానం, మొక్కల తిప్ప, బలుసుతిప్ప కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో కోడి పందేలు ఎక్కువగా జరిగాయి. యువత గుండాటల్లో పాల్గొని భారీగా నష్టపోయారు.

ముగిసిన క్రికెట్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేసిన ట్రస్టు చైర్మన్ రేవతి, ప్రెసిడెంట్ రామకృష్ణలు

కాట్రేనికోన: సంక్రాంతి సందర్భంగా అడవిపేట ఓఎన్‌జీసీ సైట్ వద్ద నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ట్రస్టు చైర్మన్ అంగాడి రేవతి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో ట్రస్టు అధ్యక్షుడు అంగాడి రామకృష్ణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో పల్లం జట్టుపై అయినాపురం జట్టు విజయం సాధించింది. టోర్నమెంట్‌లో విజయం సాధించిన అయినాపురం జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, విన్నర్‌గా నిలిచిన పల్లం జట్టుకు రూ.15 వేలు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో అంగాడి నరసింహ, భైరవ, అడవిపేట పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి జంబో విందు


కోరంగిలో కొత్త అల్లుడికి భారీ అరటి ఆకులో ఏర్పాటు చేసిన విందు భోజనం

- 99 రకాల వంటకాలతో విందు భోజనం

తాళ్లరేవు: మండలంలోని కోరంగిలో కొత్త అల్లుడికి అత్తింటివారు ఏకంగా 99 రకాల వంటకాలతో జంబో విందును ఏర్పాటు చేశారు. గతేడాది గ్రామానికి చెందిన గాలి సత్యనారాయణ కుమార్తె గీతను అనంతపురానికి చెందిన యువకుడు క్రాంతికిచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగకు కొత్త అల్లుడు క్రాంతి కోరంగిలోని అత్తవారింటికి వచ్చాడు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు సంక్రాంతి సంబరాల పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కొత్త అల్లుడికి ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి సందర్భంగా మధ్యాహ్నం భారీ అరటి ఆకు వేసి విందు పెట్టారు. గారెలు, బూరెలు, అరెసెలు, జంతికలు, సున్నుండలు వంటి పిండి వంటలతో పాటు చికెన్, మటన్, చేపలతో వివిధ రకాల కూరలు చేసి మొత్తంగా 99 రకాల వంటకాలతో విందును ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన విందును చూసి కొత్త అల్లుడు అవాక్కయ్యాడు. అన్నిరకాలు తినాల్సిందేనని బంధువులు ఆట పట్టించడంతో ఒక్కొక్కటి రుచి చూడడం కొత్త అల్లుడి వంతైంది.

కిటకిటలాడిన గౌతమీ తీరం


సందర్శకులతో కిక్కిరిసిన రాజీవ్ రివర్ బీచ్ ప్రాంతం


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

యానాం: పట్టణ పరిధిలోని గౌతమీగోదావరి రాజీవ్ రివర్ బీచ్ ప్రాంతం మంగళవారం సందర్శకులతో కిటకిటలాడింది. సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రాతో పాటు తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా సందర్శకులు తరలిరావడంతో లెక్కకు మించిన వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక శివమ్‌బాత్ వద్ద పలువురు ఉత్సాహంగా స్నానాలు ఆచరించారు. పుష్కరమాత విగ్రహం నుంచి జీసెస్ విగ్రహం వరకూ మార్గమంతా సందర్శకులతో కిక్కిరిసిపోయింది.

మరోవైపు బీచ్ వద్ద ఉన్న బోటు షికారుకు సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు ఉత్సాహం చూపారు. అదేవిధంగా ఫెర్రీరోడ్డు సైతం సందర్శకులతో నిండిపోయింది. యానాం ట్రాఫిక్, సాధారణ పోలీసు విభాగాల ఆధ్వర్యంలో సిబ్బంది గత నాలుగు రోజులుగా ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

ఉప్పలగుప్తం: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ఓ ఆటో అదుపు తప్పి ద్విచక్ర వాహనదారుల మీదకు దూసుకుపోవడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మునిపల్లికి చెందిన నిమ్మకాయల వెంకట సత్యనారాయణ, దుర్గా హేమంత్, వీరేంద్ర, సాయి నీరజ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదానికి గురైన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

104 వాహనం దగ్ధం


బాలయోగి స్టేడియం వద్ద మంటల్లో కాలిపోతున్న 104 వాహనం

అమలాపురం రూరల్: పట్టణంలోని బాలయోగి స్టేడియం వద్ద శిథిలమై ఉన్న 104 వాహనం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. మంగళవారం సాయంత్రం వాహనానికి మంటలు వ్యాపించడం, వాహనానికి పైన ఉన్న విద్యుత్ తీగల వరకూ మంటలు ఎగసిపడడంతో స్థానికులు విద్యుత్, అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారమందించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఎప్పటినుంచో మూలన పెట్టేసిన ఈ 104 వాహనానికి ప్రమాదవశాత్తూ మంటలు రేగాయా? లేక ఆకతాయిలెవరైనా నిప్పు పెట్టారా అన్న విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం పలువురు విరాళాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన దంపతులు మల్లారెడ్డి శ్రీనివాస్–స్వప్న రూ.25 వేలు, పరంశెట్టి శివ రూ.10,116, కాశీభొట్ల నరసింహమూర్తి–శుద్ధరాణిలు రూ.10,116 విరాళంగా ఇచ్చారు. అప్పనపల్లికి చెందిన గుబ్బల నాగరాజు కుటుంబ సభ్యులు రూ.15 వేలు విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

షటిల్ టోర్నమెంట్ విజేతలు


విజేతలతో చైర్మన్ నల్లి శివకుమార్

మలికిపురం: మండలంలోని మూలపోడులో సంక్రాంతి సంబరాల సందర్భంగా స్థానిక అభ్యుదయ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన సంక్రాంతి షటిల్ టోర్నమెంట్ చివరి రోజు ఫైనల్స్ జరిగింది. ఈ టోర్నమెంట్ డబుల్స్ విన్నర్స్‌గా గద్దం సుప్రీం–చింత రాజేంద్రప్రసాద్‌లు, రన్నర్స్‌గా చింతా దొరబాబు–చుట్టుగుళ్ల ఆనందరాజులు నిలిచారు. తృతీయ స్థానంలో తోటే చిట్టిబాబు జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు ఈ నెల 26 రిపబ్లిక్ డే రోజున స్థానిక ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందని స్థానికులు తెలియజేశారు. కార్యక్రమంలో తిరుమల బాబి, బుజ్జి, జీసస్, గద్దం రమేష్ బాబు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు వెండి కిరీటం సమర్పణ

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో వేంచేసిన సంతోషిమాత అమ్మవారికి అదే గ్రామానికి చెందిన బండారు నరసింహమూర్తి (కేబుల్ నెట్‌వర్క్ అబ్బులు) వెండి కిరీటం సమర్పించారు. సుమారు రూ.40 వేలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని మంగళవారం అబ్బులు దంపతులు, ఆయన కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించగా అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుడు బండారు లక్ష్మణ్ తదితరులు అబ్బులు దంపతులను వేదాశీర్వచనం నడుమ ఘనంగా సత్కరించారు.


వాడపాలెంలో సంతోషిమాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న అబ్బులు దంపతులు